కథా నిలయం
శ్రీకాకుళం

# పరకాయం

"నోర్మూసుకో, నేనూ, నా ఇష్టమన్నావంటే చంపుతా! ఆడపిల్లకు ఇష్టాలేంటే?" అని కసిరింది తల్లి.

"తమ్ముడిని నువ్వేమీ అనవు! ఎప్పుడూ గాయత్రి వెంటే పడతావు!" అంది ఏడుపు ముఖం పెట్టి గాయత్రి.

"వాడు మొగపిల్లాడు. రేపు మాకు ముసలితనంలో ధారకం పోయాల్సింది వాడే. వాడితో నీకు పంతాలేమిటి? కనుక ఇంకెప్పుడూ నా ఇష్టం, నా కది కావాలి, ఇది కావాలి అని అడక్కు"

"పోన్లే, గాయత్రికి సినిమాకు వెళ్ళాలని ఉంది. ఆ సినిమా బాగుందని కూడ గాయత్రి ఫ్రెండ్స్ చెప్పారు" అంది గాయత్రి. అలా తన్ను గురించి ఆమె ఎప్పటి నుండో ప్రథమ పురుష ఏకవచనంలో ప్రస్తావిస్తోంది కానీ తల్లది ఇప్పటి దాకా గమనించలేదు.

తల్లి కూతురివంక చూసి పగలబడి నవ్వింది. "చాల్లే, తెలివితేటలు. గాయత్రి ఎవరే, నువ్వేగా? ఎవరో మరోమనిషి అన్నట్టు, 'గాయత్రికి సినిమాకు వెళ్ళాలని ఉంది' అంటావ్" అంది.

"నువ్వేగా అమ్మా, అన్నావు- నా ఇష్టమన్నావంటే చంపుతానని! నేనిప్పుడు మాట్లాడింది నేనుగా కాదు. ఆడ పిల్లలకు 'నేన'న్న భావన ఉండరాదు. వాళ్ళకు 'నేను', 'నీవ'న్న సర్వనామాలు పనికిరావు. పుట్టినప్పుడే వీళ్ళు 'ఆడ' పిల్లలు. నీలాంటి మరో అమ్మాయిగా మాట్లాడుతున్నాను. ఈ భారతదేశంలో అమ్మాయిలకు ఇష్టాలుండవు, కోరికలుండ రాదు, బరితెగించి మాట్లాడరాదు, గట్టిగా నవ్వటం కూడ నిషిద్ధమే. తల్లిదండ్రులు భారమనుకుంటూ పెంచుతారు..." అంటూ పెరట్లోకి చూసింది. అక్కడంతా శూన్యంగా ఉంది. అక్కడ బాదంచెట్టు ఆనవాలు కూడ లేదు. "బాదం చెట్టు లాంటి వాళ్ళు. ఇష్టమయినంత కాలం పెంచుకోవచ్చు. ఇష్టంలేనప్పుడు కొట్టేయవచ్చు."

కూతురి మాటలకు భారతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చప్పున అక్కున చేర్చుకుని, "నేనేం చేయనే తల్లీ, నాది అధమస్థపు బతుకై పోయింది. ఒక్క విషయంలో నాకు స్వతంత్రం లేదు. నిన్ను సినిమాకు పంపించానంటే మీ నాయన నా మీద ఇంతెత్తున ఎగురుతాడు. మొన్న మా అక్కయ్యవాళ్ళు రమ్మని నిన్ను బలవంతం చేస్తే పంపానా! మీ నాన్న సాధించి, సాధించి నా ప్రాణం తీశాడు...."

తల్లి మాటలకు గాయత్రి మనసు ఆర్ద్రమయిపోయింది. తండ్రి సంగతి ఆమెకు తెలియంది కాదు.

పెరట్లో కమలాకరమూర్తి తల్లి పెట్టిన బాదం చెట్టు ఒకటి ఉండేది. ఆ రోజుల్లో ఆచెట్టు ఆకులతో విస్తరించి చల్లటి నీడనిచ్చేది. ఆమె ఆ ఆకులతో విస్తరాకులు కుట్టుకుని భోజనం చేసేది. కమాలాకరమూర్తి, అతని స్నేహితులు కూడ బాదం కాయలు కొట్టుకుని తినేవారు. పోను పోను దాని అవసరం ఎవరికీ లేక పోయింది. ఆమె పోయింది. విస్తరాకులు కుట్టి ఉపయోగించుకునే తీరికా, ఓపికా, అవసరం కూడ ఎవరికీ లేవు. పిల్లలక్కూడ బాదంకాయ కొట్టుకుని పప్పు తినే అవసరం లేదు. చాకలెట్లు, బిస్కట్లు వచ్చాయి. పండిన ఆకులు ఆవరణలో పడుతుంటే చికాగ్గా ఉండేది. ఓసారి భార్యకు చెప్పాడు కమలాకరమూర్తి, "చెట్టు కొట్టేయించేద్దామనుకుంటున్నాన" ని.

"ఉండ నివ్వండి. అది మన్నేంచేసింది! పచ్చని చెట్టును కొట్టించటమెందుకు?" అంది భారతి.

చెట్టును కొట్టించటం గాయత్రికి కూడ ఇష్టం లేదు. తన చిన్నతనపు ఆటలన్నీ ఆ చెట్టుతో ముడివడి ఉన్నాయి. చిన్నప్పుడు, ఏదో పాడు పని చేశాక, లంగా పైకి కట్టుకుని చెట్టు పైకి కూడ ఎక్కేది, తల్లి నుండి దెబ్బలు తప్పించుకోటానికి, బాదం చెట్టుకు ఉయ్యాల కట్టమనిమొండికేస్తే, తండ్రి చెప్పి చూశాడు, "బాదం కొమ్మ పెళుసు, కొమ్మ విరిగితే, దెబ్బలు తగులుతాయి" అని. అయినా మారం చెయ్యటంతో తండ్రి చేతిలో తన్నులు కూడ తింది గాయత్రి. వేసవి కాలం తల్లి మధ్యాహ్నం కునుకు తీస్తుంటే ఆచెట్టు నీడనే ఆమె తన స్నేహితురాళ్ళతో ఆడుకుంది.

అందుకే ఆ చెట్టును కొట్టిచేద్దామన్న ప్రతిపాదన తండ్రి చేసినప్పుడు వద్దని ఆమె గట్టిగా ప్రతిఘటించింది కానీ ఓ రోజు ఆమె స్కూలునుండి ఇంటి కొచ్చే సరికల్లా చెట్టు స్థానంలో మొండెం కనిపించింది. రేపోమాపో నేల తవ్వి మిగిలిన కాండాన్ని కూడ తొలగిస్తారు. ఆ మొండాన్ని చూసి గాయత్రి గుండెలవిసి పోయినట్లు ఏడ్చింది.

"ముయ్యి నోరు! ఏమిటా ఏడుపు, ఎవరో చచ్చిపోయినట్టు! దానివల్ల ఏం ప్రయోజనం, ఆకులు రాలటం తప్ప. దొడ్డంతా చిమ్మటానికి రెండొందలిస్తావా, మూడొందలిస్తావా అని పనిమనిషి డిమాండు చేయటం తప్ప" అన్నాడు తండ్రి.

చెట్టును కొట్టించిన చాల కాలానికి గానీ అతడికి తను చేసిన పాడు పని జ్ఞాతమవలేదు. చెట్టు ఇచ్చే నీడ ఇప్పుడు కరువయింది. చల్లదనపు ఆశ్రయం కోల్పోయిన కొంపయిందది. చెట్టు ఉన్న రోజుల్లో ఎండా కాలపు తాపం ఇంట్లో అంతగా అనుభూతమయ్యేది కాదు.

"చెట్టున్న రోజుల్లో ఇంట్లో చల్లగా ఉండేది. చెట్టును కొట్టించేసి మనం పొరపాటు చేసినట్టున్నాం" అంది భారతి ఒకటి రెండు సార్లు.

పొరపాటును తేలిగ్గా అంగీకరించే మనస్తత్వం కాదు కమలాకర మూర్తిది. అందుకే మొదట్లో భార్య ఆ ప్రస్తావన చేసినా మెదలకుండా ఊరుకున్నాడు. మళ్ళా మరోసారి అదే ప్రస్తావన చేసినప్పుడు భార్యపై పెట్రేగి పోయాడతను.

"అవును. అయితే ఏందంటా? ఇది నా ఇల్లు నా ఇష్టం! ఇక్కడ ఏది ఉండాలో, ఉండ కూడదో నిర్ణయించేది నేను. చెట్లే కాదు, మనుషులకూ అది వర్తిస్తుంది. గుర్తుంచుకో" అని అరిచాడతను.

ఆ తర్వాత మళ్ళా భారతి చెట్టును గురించిన ప్రస్తావన చెయ్యలేదు.

చెట్టు కొట్టేసిన తర్వాత గాయత్రి ఓ రాత్రి ఓ కల కన్నది. కలలో చెట్టు తన రూపంలో కనబడింది. చెట్టులో తను పరకాయ ప్రవేశం చేసినట్టనిపించింది.

"అదేమిటి నువ్వు నాలా ఉన్నావు?" అనడిగింది గాయత్రి.

"ఆడ పిల్లలందరూ నాలానే ఉంటారు. నా ఇష్టమొచ్చిన చోట నన్ను పెరగనివ్వరు. నన్ను ఉపయోగించుకుంటారు కానీ నేనంటే నిర్లక్ష్యం. వాళ్ళకయిష్టమయితే నిర్దాక్షిణ్యంగా నరికేస్తారు. కనుక, చెట్లూ, ఆడపిల్లలూ ప్రశ్న లేయరాదు. నోరుమూసుకుని పని చెయ్యాలి చెట్టూ, గాయత్రీ కూడ. అవి పరకీయాలే కానీ స్వకీయాలు కావు. ఒక్కటే తేడా. ఆడపిల్లల్లా చెట్లుకూడ కదలగలిగితే వాటినెవరూ ఇళ్ళల్లో ఉంచుకోరు. తిండి దండగ జీవులు!" అంది చెట్టు. తను మరో శరీరంలో ప్రవేశించిన భావన కలిగింది ఆమెకు. అప్పటి నుండే గాయత్రి తనను గూర్చి ప్రథమ పురుష, ఏకవచనంలో ప్రస్తావించ సాగింది.

పెరట్లో ఆదెంతో ఇంట్లో తనంత. ఆడ ఇది, ఈడ 'ఆడ'ది. దాని వల్ల తండ్రికి అణవంత ప్రయోజనం కన్పించ లేదు, పనిమనిషి కింద డబ్బు వృథా చేయటం తప్ప.

తన వల్ల కూడ తండ్రికి ప్రయోజనం లేదు, రేపు పెరిగి పెద్దయాక కట్నం రూపేణా ఆ వచ్చే అల్లుడి ఎదాన తన కష్టార్జితం ధారపోయటం తప్ప. ఇలాంటి భావాలు ఆమెలో అస్పష్టంగా రూపు దిద్దుకోసాగాయి. చెట్టును గూర్చి తండ్రి 'అది' అన్నప్పుడల్లా, అతడు తన్ను గురించే మాట్లాడుతున్నట్లుండేది గాయత్రికి. తనూ ఎక్కడో మనిషి, ప్రథమపురుష, ఏకవచనం.

తను ఇంటర్మీడియెట్ చేశాక, ఎంసెట్ రాసి ఇంజనీరింగ్ కోర్సుకు వెళ్దామనుకుంది. "చాల్లే, ఇప్పటికే నిన్ను చదివించి పొరపాటు చేశాను. నీ చదువుకు తగిన మొగుణ్ణి కొనుక్కు రాలేక నా పురమారేట్టుంది. చదివింది చాలు ఆపెయ్యి" అన్నాడు తండ్రి కమలాకరమూర్తి.

"గాయత్రి క్లాసుమేట్లందరూ కూడా ఎంసెట్‌కు ప్రిపేరవుతున్నారు" అంది గాయత్రి ముఖం ముడుచుకుని.

"నోర్మూయ్యి! నీకేది మంచిదో నాకు తెలీదా? వాళ్ళు డబ్బున్నవాళ్ళు. కూతుళ్ళ చేత ఏ వేషాలయినా వేయించ గలరు. నా దగ్గర అంత డబ్బూ లేదు, అట్టాంటి ఆటలూ సాగవు. నోరు తెరిచావంటే పీక నులుముతాను."

"ఇది వరకటి రోజుల్లా కాదు, ఇప్పుడు ఆడపిల్లటూ చదువుతున్నారు, ఉద్యోగాలు చేసుకుని వాళ్ళ బతుకులు వాళ్ళు బతుకుతున్నారు" అంది భారతి మొండి ధైర్యంతో, కూతురికి వత్తాసుగా..

"నీక్కూడా నోరు పెగుల్తుందే! నా ఇంట్లో అట్లాంటి తప్పుడు పనులు సాగవు. ఆడది చదువుకోటమే తప్పంటే, ఇంకా ఉద్యోగాలు కూడానా? రేప్పొద్దున ఎవడినో ప్రేమించానని మన పరువుతీస్తే అవమానాల పాలయ్యేది ఎవరు? నువ్వా, నేనా? కుదర్దు, దాని చదువు ఆపేస్తున్నాను. మనకు తగిన సంబంధం చూసి ఏ అయ్య చేతిలోనో పెట్టేస్తే నా బాధ్యత తీరిపోతుంది."

అయితే, గాయత్రికి పెళ్ళిచేయాలనుకున్న అతని ప్రయత్నాలు కూడ సఫలీకృతం కాలేదు. ఇంటర్మీడియెట్ చదువుకుని ఇంట్లో కూర్చుని, తండ్రి ఆదేశం ప్రకారం కుట్లూ అల్లికలూ నేర్చుకుంటున్న పిల్లను పెళ్ళిచేసుకోవటానికి మంచి క్వాలిఫికేషన్లున్న పెళ్ళికొడుకెవడూ ముందుకు రాలేదు. బాధ్యత వదిలించుకునే ప్రయత్నంలో, దారినపోయే దానయ్య చేతిలో పెట్టలేడు, కమలాకరమూర్తి కూడ. పైకి ఎంత కఠినంగా ఉన్నా కూతురి జీవితం సుఖశాంతులతో గడచిపోవాలనే అతని కోరిక. చదువు మానేసి ఏడాది గడచిపోయినా ఏ సంబంధమూ దొరక్క అయోమయ స్థితిలో ఉన్నప్పుడు అతని చిన్ననాటి

క్లాసుమేటు రమణారావు పనిమీద పట్నానికొచ్చి పిల్ల చదువు మాన్పించినందుకు కమలాకర మూర్తిని ముక్క దొబ్బులేశాడు.

"నీకు బుద్ధేమన్నా ఉందిరా? పిల్ల దానికెన్నేండ్లు! నిండా పదహారు పదిహేడు లేవు, అప్పుడే దానికి పెళ్ళేమిటి? అసలు చదువులేని పిల్లని తలకుమాసిన వాడుకూడ చేసుకోవటం లేదు, ఉద్యోగముంటేగానీ పెళ్ళికావటం కష్టమవుతున్నది. అలాంటిది నీ కూతుణ్ణెవడు చేసుకోటానికి ముందుకొస్తాడు రా! పెళ్ళికాక, చదువులేక అది ఇంట్లో నీ ఎదాన పడి ఏడవాలి. అయినా పట్నంలో ఉంటూ కూడ ఏం పాతకాలపు ఆలోచనలు చేస్తున్నావు! మేం పల్లెటూళ్ళల్లో కూడ ఇలా భావించటం లేదు" అంటూ.

"లేదురా, రమణా! చదువులంటూ పంపిస్తే ఆడపిల్లలకు ఎన్ని పెడబుద్ధులు పుడుతున్నాయో నీకు తెలీదు" అని తన తీరును సమర్థించుకో చూశాడు కమలాకర మూర్తి.

"ఎవరో ఏదో చేశారని మన పిల్ల కూడ అలా చేస్తుందని అనుకుంటే ఎట్లా? అట్లాంటి పనులు చెయ్యటానికి ఇల్లు దాటనక్కర లేదు. చేసే తప్పుడు పనులు ఇంటో కూర్చునీ చెయ్యొచ్చు. నీ ఇంట పుట్టిన పిల్ల గురించి అట్లాంటి తప్పుడు ఆలోచన్లు చెయ్యక, దాన్ని చదువులో పెట్టు. దానికి రాసిపెట్టి ఉన్నవాడితో అయినప్పుడే అవుతుంది పెళ్ళి. పెళ్ళి కోసం చదువు ఆపక."

రమణారావంటే కమలాకరానికి ఎంతో గురి. ఏ సమస్య వచ్చినా ఉత్తరం రాసి అతని సలహా తీసుకుంటాడు. అలా మిత్రుడు దొబ్బులేయటంతోనూ, తనకీ మరో మార్గం దొరక్కా మరుసటేడు గాయత్రి చేత ఎంసెట్ రాయించి, సీటొచ్చాక ఇంజనీరింగ్‌లో చేర్పించాడు కమలాకర మూర్తి. అయితే, సంవత్సరం ఇంట్లో కూర్చున్న గాయత్రికి మళ్ళీ చదువుకోవాలని లేదు. తను ఎంసెట్ రాయనన్నా తండ్రి తిట్టి రాయించాడు. చదువుమీద శ్రద్ధ ఉన్న పిల్ల కనుక, ఎంసెట్‌లో మంచి రాంకే సాధించింది. కానీ, అప్పుడు మంచి డిమాండులో ఉన్న కంప్యూటర్ సైన్స్ కోర్సులో కాక ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్‌లో ఫ్రీ సీటు లభించింది. కంప్యూటర్ సైన్స్ కోర్సంటే డొనేషన్ కట్టి ప్రయివేటు కాలేజీలో చేరాలి. నాన్-లోకల్ కోటాలో మరోయూనివర్సిటీ ఏరియాలో కంప్యూటర్ సైన్స్ కోర్సులోనే ఫ్రీ సీటు లభించింది. అయితే, పరాయి ఊరు పంపి కూతుర్ని చదివించ తండ్రి అంగీకరించలేదు. డొనేషన్ కట్టి ప్రయివేటు కాలేజీలో చేర్చటానికీ ఒప్పుకోలేదు.

"నా వల్ల కాదు. ఈ పనికి మాలిన చదువుకే అన్ని వేలు పోయాలంటే, డబ్బేం చెట్టుకు కాస్తున్నదా? ఇదయ్యాకయినా పెళ్ళి చెయ్యక తప్పదు కదా? వాడెంత డిమాండు

చేస్తాడో? ఆడపిల్లల తండ్రులంటే ప్రతి నాకొడుక్కీ లోకువే. నోర్మూసుకుని ఇక్కడే ఫ్రీ సీటు వచ్చిన కాలేజీలో చేరు" అని గట్టిగా చెప్పాడు కమలాకరరామూర్తి కూతురికి.

తను ఆ కోర్సులో చేరనని మొండికేసింది గాయత్రి. తల్లి కూడ తండ్రి పక్షమే వహించింది.

అప్పుడు ఆమెకు తను ఇంటర్మీడియేట్ చదివే రోజుల్లో ఇంగ్లీషు మాష్టరు చెప్పిన పాఠం గుర్తుకు వచ్చింది.

"నామవాచకాలకు బదులుగా వాడేవి సర్వనామాలు. ప్రతి మనిషికీ ఈ ప్రపంచంలో తనే ప్రధానం. తనే ఈ భూమండలం తిరగటానికి ఇరుసనుకుంటాడు. పోనీ అంత గొప్పగా కాక పోయినా, ఎవరికయినా తన తర్వాతనే ఏదయినా. కనుక అతడు తన్ను గురించి చెప్పుకుంటూ 'నేను', 'నేను' అంటాడు. అందుకే ఇంగ్లీషులో మాట్లాడే వ్యక్తిని, తన్ను గురించి చెప్పుకునే వ్యక్తిని ఫస్ట్ పర్సన్ అన్నారు.తెలుగులో దాన్నే ఉత్తమ పురుష అంటారు. ఎవరితో మాట్లాడుతున్నాడో అతడిని సెకండ్ పర్సన్ అన్నారు. తెలుగులో మధ్యమ పురుష అంటారు. ఈ ఇద్దరూ కాక మూడో వ్యక్తిని థర్డ్ పర్సన్ అంటారు. తెలుగులో అదే ప్రథమ పురుష. "నువ్వు', 'నేనూ' తప్ప, ప్రపంచంలో అందరూ మూడో వ్యక్తులే. నాకు అలాంటి వాళ్ళ పేర్లు కొన్ని తెలుసు. కానీ ఆ పురుషలోని అసంఖ్యాకమయిన జనం నాకు తెలీకుండా అనామకంగా ఉండిపోతారు. దె ఆర్ మిలియన్స్ అండ్ బిలియన్స్ ఆఫ్ ఫేస్‌లెస్ పీపుల్. మానవుల్లో కులాలూ, జాతులూ ఉన్నాయి. వీరిలోచాల కొద్ది మంది ప్రముఖులు, ఫస్ట్ పర్సన్, సెకండ్ పర్సన్ లాంటి వాళ్ళు; మిగతా అగణిత జన సమూహమంతా ప్రాధాన్యంలేని వాళ్ళు, థర్డ్ పర్సన్‌లే. భాషలో ప్రత్యామ్నాయం లేక, వీళ్ళూ 'నేను', 'నేను' అనుకుంటారు, కానీ వీళ్ళ కలాంటి అర్హత లేదు. పాత రోజుల్లో, 'అంటారానివాడు వస్తున్నాడు, తప్పుకోండి' అంటూ తన్ను గురించి ప్రకటించుకుంటూ వీథిలో వెళ్ళే అప్పటి అస్పృశ్యుడి లాంటి వ్యక్తులు వీళ్ళు....."

"అంటే ఆడపిల్లల్లాంటి వాళ్లా, సార్!" అనడిగిందో అమ్మాయి.

"యస్. ఎగ్జాక్ట్‌లీ! నువ్వు జలజవి. యువార్ డాటర్ ఆఫ్ దశరథ రామారావు. వాటెబౌట్ యువర్ మదర్? షి ఈజ్ థర్డ్‌పర్సన్ సింగ్యులర్, బిలాంగ్స్ టు ఎ వాస్ట్ బ్రీడ్ ఆఫ్ పాప్యులేస్! ఇంటి యజమాని తండ్రి. తల్లి కుటుంబంలో సెకండ్ రేట్ మెంబర్. మగపిల్లలు ప్రివిలేజ్డ్ క్లాస్, ఆడపిల్లలు సెకండ్ రేట్ సిటిజన్‌లు. కనీసం మగ పిల్లలు ప్రథమ పురుష బహు వచనాలు, అమ్మాయిలు థర్డ్ పర్సన్ సింగ్యులర్‌లు. సాటి స్త్రీ నుండి కూడా వీళ్ళకు సమర్థన లభించదు...."

అలా ఆయన పాఠాన్ని మించి ఇంగ్లీషులో ఉపన్యసిస్తూండేవాడు. 'పిచ్చివాడు' అని తామా రోజుల్లో ఆయన్ని గురించి అనుకునే వాళ్ళు. కొంతమందయితే 'క్రాక్' అని కూడ భావించేవారు. ప్రపంచాన్ని ఉల్టాగా చూస్తాడని అందరూ అనుకునేవారు కానీ ఆయనే సరిగ్గా చూస్తున్న వ్యక్తని తనకు చాల రోజులకు గానీ తెలియలేదు. అప్పటికే ఆమె తన్ను 'ప్రథమ పురుష, ఏకవచనం' గా భావించ సాగింది. తనను గురించి ప్రస్తావించవల్సి వచ్చినప్పుడల్లా ప్రథమ పురుష ఏకవచనంలోనే మాట్లాడుతుంది. 'నేను కాలేజీకి వెళ్తున్నా'నని అనదు, 'గాయత్రి కాలేజీకి వెళ్తున్నది' అంటుంది.

తమ్ముడు భార్గవుడికి ఎంసెట్‌లో మంచి రాంక్ రాలేదు. అయినా లక్షలు డొనేషన్లు పోసి గుల్బర్గా మెడికల్ కాలేజీలోచేర్పించాడు కమలాకర మూర్తి. కొడుక్కు సీటు వచ్చిన విషయం ఆనందంగా భార్యకు చెప్తున్నప్పుడు, కూతురు తన వంక ఎద్దేవాచేసినట్టుగా చూస్తున్నట్లనిపించి, "వాడంటే మరి రేపు సంసారాన్ని పోషించాల్సినవాడు. ఇప్పుడు ఖర్చు పెడ్తేనే రేపు సంపాదించ గలిగేది. ఆడపిల్లలా పెళ్ళి చేసుకుని చక్కా పోయేందుకు వాడికి కుదరదు కదా?" అన్నాడు కమలాకరమూర్తి.

"గాయత్రి కూడ తల్లి దండ్రులను మర్చిపోయేది కాదు" అంది గాయత్రి.

"నువ్వు మమ్మల్ని చూస్తానన్నా ఆ వచ్చే మొగుడు అనుమతించవద్దుటే! నేను మా అమ్మానాయనలకేం చెయ్య గలిగాను? సంవత్సరానికో సారయినా పిల్చి కొత్త బట్టలయినా పెట్ట లేకపోయాను. కిందటేడు మా అమ్మకు గుండె ఆపరేషనప్పుడు, 'అమ్మకు సాయంగా ఆసుపత్రిలో ఉందువు గాని రావే!' అని మా అన్నయ్య కబురు చేసినా వెళ్ళలేక పోయాను. చివరకు ఆపరేషను టేబుల్ మీదే పోయింది" అంది భారతి కళ్లు పమిటతో వత్తుకుంటూ.

"బావుంది. ఎలా వెళ్తావు? భార్గవుడికి ఇంటర్మీడియెట్ పరీక్షలు. మనం కనిపెట్టుకుని ఉంటేనే వాడిది అంతంత మాత్రపు చదువు! నేను ఆఫీసునుండి వచ్చేటప్పటికి పొద్దు పోయేది. అప్పుడే మాకు ఇన్‌స్పెక్షన్లు కూడ వచ్చి తగలడ్డాయి! ఇంక నువ్వు కూడ కొంపలో లేక పోతే వాడినెవరే పట్టించుకుంటారు?" అన్నాడు కమలాకరమూర్తి, విసుక్కుంటూ.

"గాయత్రి తమ్ముడి చదువు విషయంలో శ్రద్ధతీసుకుంటానని చెప్పింది" అన్నది గాయత్రి.

"నీ మాట వింటాడా వాడు? అట్టా పెంకి వెధవలాగా తయారు చేసింది మీ అమ్మ వాడిని! అతి గారాబం!" అంటూ ఇంకా తల్లిని తల్చుకుని కుమిలిపోతున్న భార్య వంక చూసి, "ఏవిటా ఏడుపు, నట్టింటో కూర్చుని, అశుభంగా? తల్లిదండ్రుల బాధ్యత కొడుకులది. ఆడపిల్లలు వీలయితే ఓ సారి వచ్చి చూడగలరు కానీ అంతకంటే ఏం

చేయగలరు! ఎవరి సంసారాలు వాళ్ళవి. మీ అన్నయ్యేం తక్కువవాడు కాదు. ఆమె బతకలేదు కానీ, లేకపోతే ఓ రెండు నెలల పాటు ఉండి మీ అమ్మ సంరక్షణ చూసుకోవాలని చెప్పాడు! అయ్యే పనేనా? ఆడపిల్లలు తమకేదో చెయ్యాలని తల్లిదండ్రులు భావించటం కూడ తప్పు" అన్నాడు కమలాకరరావు పెద్దగా అరుస్తూ.

గాయత్రి చదువు పూర్తి చేసుకుంది. కాంపస్ సెలక్షనులో ఆమెకు విప్రోలో ఉద్యోగమొచ్చింది. గాయత్రి ఉద్యోగం విషయంలో మళ్ళా ఇంట్లో రభస అయింది. తండ్రి ఆమె చదువు పూర్తికాక ముందే పెండ్లికి ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. అయితే, ఏదీ కలసి రాలేదు.

ఈ సారి గాయత్రి తండ్రికి నిశ్చయంగా చెప్పింది, "గాయత్రి ఉద్యోగంలో చేర్తోంది. ఈ విషయంలో చర్చలు అనవసరం" అని.

"అంటే నీ ఇష్టమొచ్చినట్టు చేస్తావా, బరి తెగించి!" అని గర్జించాడు కమలాకర మూర్తి.

"ఉద్యోగం చేయటం బరితెగించటమంటే గాయత్రేం చెయ్యలేదు" అని నిశ్చయంగా చెప్పి వెళ్ళిపోయింది, ఉద్యోగంలో చేరటానికి.

ఆ రోజు నుండి తండ్రి ఆమెతో మాట్లాడటం మానేశాడు. గాయత్రి కెంతో మనస్తాపం కలిగింది. "గాయత్రికి నాన్న మాట్లాడక పోవటం వల్ల ఏంతో దుఃఖం కలిగింది. తనను క్షమించవలసింది" అని అతనికి ఉత్తరం రాసి చూపింది.

అతడు మాట్లాడలేదు. 'అంత దుఃఖం కలిగిన దానివి ఉద్యోగం మానేసి ఆమాట చెప్పు' అన్నట్టు అతడు ఆమె వంక చూశాడు. అయితే, ఆమె ఉద్యోగం మానలేదు. అతడూ మాట్లాడలేదు. రెండేళ్ళయ్యాయి. గాయత్రికి ఇరవైమూడేళ్ళు. తండ్రి పిల్లకు పెండ్లి కాలేదని దిగులుపడి పోయాడు. ఏసంబంధమూ కుదరలేదు.

ఓ రోజు ఆమె ఆఫీసులోనే పనిచేసే ఓ యువకుడు వచ్చి కమలాకరమూర్తితో చెప్పాడు, "నా పేరు సుధాకర్. నేనూ విప్రోలోనే పని చేస్తున్నాను. సాఫ్టువేర్ ఇంజనీరుని. మీ అమ్మాయి గాయత్రి అంటే నాకు ఇష్టం కలిగింది. మీరు అంగీకరిస్తే ఆమెను వివాహం చేసుకుంటాను"అని.

"ఇదేం మర్యాద! వెళ్ళి మీ తల్లిదండ్రులని పంపు. కులం, శాఖ, గోత్రం వగైరా చూసుకోవల్సిన పని లేదా? పెళ్ళంటే అటు ఏడు తరాలూ, ఇటు ఏడు తరాలూ విచారించుకోవాలి!" అన్నాడు కమలాకరమూర్తి.

"కులం ఒకటే నండీ, శాఖ మాత్రమే భేదం. అయినా ఈ రోజుల్లో వాటి నెవరు

పట్టించుకుంటున్నారు" అన్నాడు సుధాకర్.

"మీకు లేక పోవచ్చు, మా కున్నాయి! ఈ పెళ్ళి జరిగేది కాదు."

"నేను చెప్పే మాటలు ఒక్క క్షణం విన్నాక ఆ మాట అనండి."

"మంచీ మర్యాద తెలీని మనిషివి! నీతో మాటలేంటి? వెళ్ళు, వెళ్ళు"అని అతడిని తిట్టి పంపేశాడు కమలాకర మూర్తి.

అతడటు వెళ్ళగానే భార్యమీద విరుచుకు పడ్డాడు: "నేను ముందటి నుండే చెప్తున్నాను. ఆడ ముం..కు మొగుడికి ఉత్తరం రాసుకునే చదువు చాలంటూనే ఉన్నాను. నువ్వు కాలం మారి పోయిందంటూ స్కూల్లో చేర్పించిందాకా పోరు పెట్టావు! మా వెధవాయి వచ్చి నన్ను పెడతోవన పట్టించాడు. చదువయ్యేటప్పటికి కొమ్ములొచ్చాయి. 'ఇంక నువ్వు లెక్కేంది, నా నౌకరీ నేను చేసుకుని బతుకుతాను' అన్న పొగరు! ఇప్పుడది మన కులం కాని వెధవ నెవడినో ప్రేమించిందట!´తను నాతో సీదా మాట్లాడ లేక ఆ వెధవను నా దగ్గరకు పంపింది.ఎంత ధైర్యం వెధవకు! నీ కూతుర్ని పెళ్ళి చేసుకుంటానని నాతోనే అనటానికి! దాన్ని ఉద్యోగం మానెయ్య మను. ఇంతటితో వాడితో సంబంధం పోతుంది" అని.

పక్క గదిలో ఉన్న గాయత్రి వినాలనే అతడు పెద్దగా అరిచినట్టు చెప్పాడు. గాయత్రి బయటకు వచ్చి తండ్రికి చెప్పింది "అతను తన ఆఫీసులో పని చేస్తున్నవాడే.కానీ, అతనితో ప్రేమలో పడేంత సంబంధం గాయత్రికి లేదు. మీరేవేవో ఊహించుకుని మాట్లాడకండి. అతను మనింటికి వస్తాడనికూడ గాయత్రికి తెలీదు. మన అడ్రసు ఆఫీసులో సంపాదించాడేమో?"

"నా కండ్లకు గంతలు కట్టకు. పిల్లలేమి చేస్తున్నా అందరికీ తెలిశాకే తల్లిదండ్రులకు తెలుస్తుంది. ఏ ప్రేమ, ప్రోత్సాహం లేకపోతే వాడంత ధైర్యంగా వచ్చి నన్నడగ గలడు! డబ్బు సంపాదిస్తున్నావని అహంకారం పెరిగిందేమో నీకు! ఆడపిల్ల డబ్బు వాడుకునే నికృష్టుడు కాదు ఈ కమలాకరమూర్తి!"

అతడి మాటలు నిజమే. కూతురి సంపాదనలో పైస అతడు ముట్టలేదు. ఉద్యోగమొచ్చిన తర్వాత తల్లికీ తండ్రికీ తమ్ముడికీ బట్టలు తెచ్చినా అతడు వాటిని స్వీకరించ లేదు, భార్యనీ, కొడుకునీ కూడ తీసుకోనివ్వ లేదు.

"నీ సంతానాన్నే నువ్వు నమ్మలేక పోతే గాయత్రి చెయ్య గలిగిందేం లేదు" అని గదిలోకి వెళ్ళి పోయింది గాయత్రి.

అప్పటికీ కమలాకరమూర్తి ఆగ్రహం చల్లార లేదు. భార్య దగ్గర తన కోపం వెళ్ళ

గక్కుతూనే ఉన్నాడు. చివరగా చెప్పాడు: "అది ఉద్యోగం మానెయ్యాలి. ఈ పెళ్ళి నుండి తప్పించాలంటే మరో మార్గం లేదు. అది ఉద్యోగమయినా మానాలి, లేకపోతే నా కొంపలో నుండి బయటకయినా వెళ్ళాలి. ఇక్కడే ఉండి తనిష్టమొచ్చినట్టు నాటకాలాడతానంటే కుదర్దు. అది ఏ విషయం నిర్ణయించుకునేదాకా నేనింట్లో భోజనం చెయ్యను. నా మాట వినని మర్నాడు నాకు దానితో సంబంధం లేదు. ఏ గోతిలో దిగుతుందో దానిష్టం! ఆ పెళ్ళి చేసుకున్నాక అది నా కొంపలో అడుగు పెట్టటానికి వీలులేదు. నా కో కొడుకున్నాడు, చాలు. మాట వినని కూతుళ్ళు పోయినా నా కిబ్బంది లేదు."

భర్త ఇంట్లో భోజనం చెయ్యనని ప్రతిజ్ఞ చేశాక భారతి లబలబ లాడి పోయింది. అతను మొండి మనిషి. ప్రాణం పోయినా పట్టు విడవడు. ఆమె గాయత్రితో ఉద్యోగం మానెయ్యమని పోరు పెట్టింది.

సుధాకర్ అనే వ్యక్తి ఆ సంస్థలో పనిచేస్తున్న విషయం గాయత్రికి తెల్సు. అతడు ఆమెతో మాటలు కలుప ప్రయత్నించాడు కానీ ఆమె పరిహరించింది. అతనితో ఆమె ప్రేమలో పడిందన్న ఆమె తండ్రి అభియోగం నిరాధారం. అలాంటిది అతడు సీదా వచ్చి తన తండ్రితో పెళ్ళి ప్రస్తావన చెయ్యటం ఆమెకు కోప కారణ మయింది. ఆఫీసులో కలసినప్పుడు, అతడిని అదే ప్రశ్నించింది, 'మనకేం పరిచయముందని మీరు మా నాన్నతో పెళ్ళి ప్రస్తావన చేశార'ని.

అందుకతడు చాల నెమ్మదిగా సమాధాన మిచ్చాడు.

"మిమ్మల్ని ఈ రెండేళ్ళుగా గమనిస్తూనే ఉన్నాను. ఎందుకో మీరంటే నాకిష్టం కలిగింది. మీ నాన్నగారికి రమణారావు గారని ఓ స్నేహితుడు ఉన్నాడు. ఆయనది మా ఊరే. మొన్నా మధ్య అక్కడికి వెళ్ళినప్పుడు, 'మా అమ్మాయి కూడ అదే సంస్థలో పని చేస్తున్నది. నీకు తెలుసునా?' అని అడిగాడు. 'మీ అమ్మాయా? మీకు అబ్బాయిలే కానీ అమ్మాయిలు లేరే!' అని ఆశ్చర్య పోతూ అన్నానాయనతో. 'ఓర్నీ బండపడ! నాకు తెలీదు్రా ఆమాత్రం! మా అమ్మాయంటే నా స్నేహితుడి కూతురు. అంటే నా కూతురు లాంటిదే' అంటూ వివరాలు చెప్పాడు. ఆయన్ని మేం 'మామయ్య గార'ని పిలుస్తాం. మాకందరికీ ఆయనంటే ఎంతో గౌరవం. ఆయన అలా చెప్పాక, నాకు మరింత ప్రోత్సాహం లభించింది. 'మా కమలాకరమూర్తి చాల మంచివాడు, అమృత హృదయుడు. స్నేహానికి ప్రాణాలిచ్చే మనిషి' అని చెప్పటంతో నేను మీ ఫాదర్‌ని కలిసి ప్రపోజ్ చేసే ధైర్యం చేశాను. అదే నేను చేసిన పొరపాటు! రమణారావు మామయ్యద్వారా విషయం కదిపి ఉండాల్సింది.

ఊరికెళ్ళినప్పుడు మామయ్యను కలిసి చెప్తాను. నేనప్పుడే నిరుత్సాహ పడిపోలేదు...”

“రమణారావు మామయ్య మీకు తెలుసని నాన్నకు చెప్పొచ్చుగా?” అంది గాయత్రి కినుకగానే.

“ఎక్కడా, ఆ అవకాశం ఇస్తేనా ఆయన? తరిమి తరిమి కొడితే, ఏం చెప్ప గలను.”

“మరో మాట! ముందుగా గాయత్రితో ఆ ప్రస్తావన చెయ్యకుండా ఆమె తండ్రి దగ్గరకు వెళ్ళటం మీరు చేసిన తప్పు. ఆడదానితో మాట్లాడేదేమిటిలే అనుకున్నారేమో మీరు!”

“మీరు కాక మరో గాయత్రి ఎవరు? ఎవరి సంగతి మీరు చెబుతున్నది?” అన్నాడతను ఆశ్చర్యపోతూ.

“ఈ గాయత్రి సంగతే! మరో గాయత్రి ఎవరో ఈమెకు తెలీదు.”

అప్పటికతని కర్థమయింది. పగలబడి నవ్వాడు.

“‘నేను’ అన్న పదం ఉచ్చరించకూడదని భీష్మించుకు కూర్చున్నారా?” అన్నాడు.

“భీష్మించుకుంటే ప్రయోజన మేముంది! ప్రేమించామనుకున్న వ్యక్తులు కూడ పిల్ల తండ్రితోనే మాట్లాడ ప్రయత్నిస్తారు కానీ తాము ఇష్టపడిన పడతితో మాట్లాడరు. ఈ దేశంలో ఆడదానికి ఐడెంటిటీ ఉండదు. ఓ తండ్రి కూతురు, ఓ మొగుడి భార్య, మరో మొగాడి తల్లి. ‘నేను’ అంటే మా నాయన కూతుర్ని, ఆయన చెప్పినట్టు వినాల్సిందాన్ని. ఈ ‘నేను’కు కోరికలుండవు. కనీసం గాయత్రి అనుకుంటే నా నుండి భిన్నమయిన ఆ వ్యక్తికి కొంత స్వాతంత్ర్యమయినా ఉండే అవకాశం ఉంది. కనుకనే గాయత్రి ‘నేను’ అన్నపదాన్ని పరిహరించింది.”

“యువారె ఏన్ ఇంటరెస్టింగ్ గళ్! మీతో ముందుగా మాట్లాడకపోవటం నేను చేసిన పెద్ద పొరపాటు! క్షమించెయ్యండి. ఆత్మత్యాగం మహా పాపం! మళ్ళీ మనం కలిసినప్పుడు నేను మీ ‘నేను’తోనే మాట్లాడతాను” అని చెప్పి అతను వెళ్ళిపోయాడు.

ఇంటి కెళ్ళాక గాయత్రి తల్లికి చెప్పింది, తమ ఇంటికి వచ్చిన సుధాకర్ “రమణారావు మామయ్యా ఊరు మనిషేనట! తను ఆ విషయం చెబ్దామని ప్రయత్నించినా వినకుండా నాన్న తిట్టి పంపేశారు” అని చెప్పింది.

భారతి ఆ విషయం కమలాకర రావుకు చెప్పినప్పుడు, “అయితే ఏంవిటటా? వాడికి పరిచయుస్థుడయినంత మాత్రాన నేను శాఖాంతర వివాహానికి ఒప్పుకుంటా ననుకున్నారా? నా కంఠంలో ప్రాణం ఉండగా ఆ పని జరుగదు” అన్నాడు.

అన్నట్టుగానే అతడు ఆ రాత్రి ఇంట్లో భోజనం చెయ్యలేదు. మర్నాడూ అదే పరిస్థితి.

గాయత్రికి మరోమార్గం కన్పించలేదు, తను ఇంటి నుండి వెళ్ళిపోవటం తప్ప. మూడో రోజు ప్రయత్నించి వర్కింగ్ విమెన్స్ హాస్టల్‌లో చేరింది.

తల్లికి చెప్పింది, తను ఇంట్లోనుండి వెళ్ళిపోతున్నట్టు. ఆమె గోల పెట్టింది, తన కూతురి కేదో అయిపోయినట్టు.

"నేనేం చెయ్యనే అధమస్థపు దానిని! తండ్రీ కూతుళ్ళలో ఎవరూ నామాట వినరు. మొండి పట్టు పట్టుకు కూర్చున్నారు. పెళ్ళికూడ కాకుండ వెళ్ళి ఇప్పుడతనితో కాపురం పెడతావుటే?" అని శోకించింది ఆమె.

"గాయత్రి కావాలని వెళ్ళటం లేదు. మీరే ఆమెని ఇంటి నుండి బయటికి పంపేస్తున్నారు. వర్కింగ్ విమెన్స్ హాస్టల్‌లో చేర్తుంది. తను 'నేను'గా ఉండటానికి వెళ్తోంది. ఈ పరకాయపు బతుకు తనకెప్పటినుండో ఇష్టం లేదు. తన్నో వ్యక్తిగా, 'నేను'గా గుర్తించే వ్యక్తిని పెళ్ళి చేసుకుంటుంది. అది సుధాకర్ కావచ్చు, మరొకరు కావచ్చు" అంది గాయత్రి.

"పోనీవే అమ్మా! రెండు రోజుల్లో బుద్ధి తిరిగి అది వెనక్కి రాకపోతే నన్నడుగు" అన్నాడు భార్గవుడు.

"నాన్న పాత తరం మనిషి! అర్థం చేసుకోవచ్చు. నువ్వు కూడా పాత తరం ఆలోచనలు పట్టుకు వేలాడుతుంటే ఆ దేవుఁడు కూడా నిన్ను ఉద్ధరించలేడు. వస్తా" అని చెప్పి పెట్టె పట్టుకుని వెళ్ళిపోయింది గాయత్రి.

కమలాకరమూర్తి ఇంట్లోనే ఉన్నాడు కానీ బయటకు రాలేదు. కూతురు తన మాట వినకుండా వెళ్ళిపోతున్నందుకు తనకి ఆగ్రహం కలిగిందో, లేక దుఃఖం కలిగిందో అతనికే సరిగా తెలియదు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పోషించాల్సిన భార్గవుడు కొద్ది రోజుల్లో కులాంతర వివాహం చేసుకోబోతున్నాడనీ అతనికి తెలీదు.

రచన మాసపత్రిక లో. రచన-కౌముది సంయుక్తంగా
నిర్వహించిన పోటీలో బహుమతి గెల్చుకున్న కథ. జులై 2011.